

## అవైస్‌కు కాంస్యం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: రాజస్థాన్ వేదికగా జరిగిన 34వ జాతీయ సీనియర్ వుషు టోర్నీలో తెలంగాణకు చెందిన మహమ్మద్ అవైస్ కాంస్య పతకంతో మెరిశాడు. శుక్రవారం జరిగిన సీనియర్ విభాగంలో బరిలోకి దిగిన నిజామాబాద్ ప్లేయర్ అవైస్ అద్భుత ప్రదర్శన కనబరుస్తూ మూడో స్థానంలో నిలిచాడు. గత కొన్నేండ్లుగా నిజామాబాద్‌లో కోచ్ అబ్దుల్ ఒమర్ దగ్గర శిక్షణ తీసుకుంటున్న అవైస్.. జాతీయ స్థాయి టోర్నీలో ఆకట్టుకున్నాడు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు అతన్ని అభినందించారు.

## రసవత్తరంగా గాలె టెస్టు

గాలె: శ్రీలంక, బంగ్లాదేశ్ మధ్య గాలె వేదికగా జరుగుతున్న తొలి టెస్టు రసవత్తరంగా సాగుతున్నది. తొలి ఇన్నింగ్స్‌లో లంకేయులు.. 485 పరుగులకు ఆలౌట్ కాగా పర్యాటక బంగ్లాకు 10 పరుగుల స్వల్ప ఆధిక్యం దక్కింది. ఇక రెండో ఇన్నింగ్స్‌లో బంగ్లా.. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 3 వికెట్ల నష్టానికి 177 పరుగులు చేసింది. షద్మన్ ఇస్లాం (76) అర్ధ శతకంతో మెరవగా తొలి ఇన్నింగ్స్ సెంచరీ హీరోలు కెప్టెన్ నజ్ముల్ (56*), ముష్ఫికర్ (22*) క్రీజులో ఉన్నారు.

## హైదరాబాద్ హీరోస్ హ్యాట్రిక్

- రగ్బీ ప్రీమియర్ లీగ్



హైదరాబాద్, ఆట ప్రతినిధి: జీఎంఆర్ రగ్బీ ప్రీమియర్ లీగ్(ఆర్‌పీఎల్) తొలి సీజన్‌లో హైదరాబాద్ హీరోస్ హ్యాట్రిక్ విజయంతో అదరగొట్టింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 43-12 తేడాతో కళింగ బ్లాక్‌టైగర్స్‌పై ఘన విజయం సాధించింది. దీంతో వరుసగా మూడో విజయాన్ని ఖాతాలో వేసుకున్న హీరోస్.. పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో కొనసాగుతున్నది. పూర్తి ఏకపక్షంగా సాగిన ఈ పోరులో హీరోస్ ఏడు ట్రైలను సాధించింది. జట్టులో ఆరుగురు ప్లేయర్లు ట్రైలు చేసి తమ సత్తాచాటారు. జోజి నాసోవా రెండు ట్రైలతో అద్భుత ప్రదర్శన కనబర్చగా, టెరియో తమాని నాలుగు ట్రైలను గోల్‌గా మలిచి జట్టుకు 8 పాయింట్లను అందించాడు. మ్యాచ్‌లో తొలుత కళింగ ఆధిపత్యం ప్రదర్శించినా.. ఆ తర్వాత పుంజుకున్న హైదరాబాద్ వరుస పాయింట్లతో జోరు కనబరిచింది. కీలకమైన ద్వితీయార్ధంలో అదే దూకుడుతో మ్యాచ్‌ను కైవసం చేసుకుంది.

## భారత్‌కు తొమ్మిది పతకాలు

సింగపూర్: ఆసియా ఆర్చరీ కప్ స్టేజ్-2లో భారత్‌కు తొమ్మిది పతకాలు దక్కాయి. వేర్వేరు టీమ్‌విభాగాల్లో ఐదు జట్లు ఫైనల్ పోరుకు అర్హత సాధించినా అన్నింట్లో భారత్ రెండో స్థానంలో నిలిచి రజత పతకాలతో సరిపెట్టుకుంది. టోర్నీలో మొత్తంగా భారత ఆర్చర్లు రెండు స్వర్ణాలు సహా, ఆరు రజతాలు, ఒక కాంస్యం ఖాతాలో వేసుకున్నారు. భారత ఆర్చర్లు తమ కంటే తక్కువ సీడ్ ప్లేయర్ల చేతిలో ఓటమిపాలై రజత పతకాలకు పరిమితమయ్యారు. పురుషుల రికర్వ్ టీమ్ ఈవెంట్‌లో విష్ణుచౌదరి, పారాస్ హుడా, జుయెల్ సర్కార్‌తో కూడిన భారత త్రయం 0-6తో జపాన్ చేతిలో ఓడింది. రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ ఫైనల్లో చౌదరీ, వైష్ణవి పవార్ జోడీ 32-35తో ఇండోనేషియాపై ఓడి రజతంతో సంతృప్తిపడింది. మరోవైపు పురుషుల కాంపౌండ్ ఫైనల్లో కుశాల్‌దలాల్ 149-143తో జోషు వా మనాన్ (ఆస్ట్రేలియా) పై గెలిచి పసిడితో మెరిశాడు. మహిళల విభాగంలో తేజల్ సాల్వే 146-144తో భారత్‌కే చెందిన షణ్ముకినాగ సాయిపై గెలిచి స్వర్ణం సొంతం చేసుకుంది.

## సెంథిల్ కుమార్‌కు కాంస్యం



కౌలాలంపూర్: మలేషియా వేదికగా జరుగుతున్న ఏషియన్ స్క్వాష్ చాంపియన్‌షిప్‌లో భారత యువ ప్లేయర్ వెలావన్ సెంథిల్‌కుమార్ కాంస్య పతకంతో మెరిశాడు. శుక్రవారం జరిగిన పురుషుల వ్యక్తిగత సెమీఫైనల్ పోరులో 9-11, 11-13, 11-5, 6-11తో టాప్‌సీడ్ లు జు క్వాన్(హాంకాంగ్) చేతిలో ఓటమిపాలయ్యాడు. 65 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన పోరులో సెంథిల్ ప్రత్యర్థికి దీటైన పోటీనివ్వడంలో విఫలమయ్యాడు.

## మహిళల క్రికెట్‌లో అనుమతివ్వండి..

- ఐసీసీ, బీసీసీఐకి అనయ బంగర్ లేఖ

లండన్: మహిళల క్రికెట్‌లో ఆడేందుకు తనకు అనుమతి ఇవ్వాలని అనయ బంగర్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు హార్మోన్ రిప్లేస్‌మెంట్ థెరపీ(హెచ్‌ఆర్‌టీ) నివేదికను పొందుపరుస్తూ ఎనిమిది పేజీలతో కూడిన లేఖను ఐసీసీతో పాటు బీసీసీఐకి పంపింది. ట్రాన్స్‌జెండర్లకు మద్దతుగా నిలువాల్సిందిగా అనయ సోషల్‌మీడియాలో పోస్ట్ చేసిన తన లేఖలో ప్రముఖంగా ప్రస్తావించింది. 2021లో అబ్బాయి నుంచి అమ్మాయిగా మారిన 24 ఏండ్ల అనయ మాట్లాడుతూ 'జాతీయ జట్టుకు తిరిగి ఆడాలనుకుంటున్నాను. దేశానికి ఆడాలన్న తపన నాలో అప్పుడు ఎలా ఏందో ఇప్పటికీ అలాగే ఉంది. కలను సాకారం చేసుకునేందుకు అన్ని రకాలుగా ప్రయత్నం చేస్తూనే ఉన్నాను. ఏదో ఒక రోజు తండ్రి సంజయ్ బంగర్ నాకు మద్దతుగా నిలుస్తాడన్న నమ్మకం నాకుంది' అని లేఖలో పేర్కొంది. 2023 వన్డే ప్రపంచకప్ సమయంలో క్రికెట్‌లో ట్రాన్స్‌జెండర్ల ప్రాతినిధ్యంపై ఐసీసీ నిషేధం విధించిన విషయం విదితమే.



### సెంచరీలతో రెచ్చిపోయిన గిల్, జైస్వాల్

# శతక ధమాకా

**రాణించిన పంత్, రాహుల్**

**భారీ స్కోరు దిశగా భారత్**

**మొదటి రోజు 359/3**



గిల్ (127*)

జైస్వాల్ (101)

**5** టెస్టులలో సారథిగా తొలి మ్యాచ్‌లోనే సెంచరీ చేసినవారిలో గవాస్కర్, హజారే, వెంగ్‌సర్కార్, కోహ్లీ తర్వాత గిల్ ఐదో స్థానంలో నిలిచాడు.

**ఎన్నో అనుమానాలు! అంతకుమించిన సందేహాలు! కోహ్లీ, రోహిత్, అశ్విన్ వంటి దిగ్గజాల నిష్క్రమణ వేళ కఠినమైన ఇంగ్లండ్ పిచ్‌లపై అంతగా అనుభవం లేని టీమ్‌ఇండియా ఎలా ఆడబోతుందోనని..! కానీ తొలిటెస్టు మొదటిరోజే ఆ అనుమానాలన్నింటినీ పటాపంచలు చేస్తూ లీడ్స్ టెస్టులో యువ భారత్ అదరగొట్టింది. సారథ్య బాధ్యతలు అందుకున్న అరంగేట్ర టెస్టులోనే బ్యాటుతో శుభ్‌మన్ గిల్ అజేయ శతకంతో సత్తాచాటగా.. క్రీజులో కుదురుకుంటే మూడంకెల స్కోరు సాధించిగానీ పోరాటాన్ని ఆపని యోధుడు యశస్వీ జైస్వాల్ సెంచరీకి తోడు వైస్ కెప్టెన్ రిషభ్ పంత్ అర్ధ శతకంతో భారత్ భారీ స్కోరు దిశగా సాగుతున్నది.**

హెడింగ్లీ: భారత టెస్టు జట్టు కొత్త సారథి శుభ్‌మన్ గిల్ (175 బంతుల్లో 127 నాటౌట్, 16 ఫోర్లు, 1 సిక్స్), యువ ఓపెనర్ యశస్వీ జైస్వాల్ (159 బంతుల్లో 101, 16 ఫోర్లు, 1 సిక్స్) శతక్కొట్టడంతో హెడింగ్లీలో ఇంగ్లండ్‌తో మొదలైన తొలి టెస్టులో భారత్ మొదటి రోజే భారీ స్కోరు చేసింది. లీడ్స్ వేదికగా శుక్రవారం మొదలైన టెస్టులో టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేస్తున్న భారత్.. తొలి రోజు ఆట ముగిసే సమయానికి 85 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 359 పరుగులు చేసి పటిష్ట స్థితిలో నిలిచింది. గిల్, జైస్వాల్ శతకాలకు తోడు రిషభ్ పంత్ (102 బంతుల్లో 65, 6 ఫోర్లు, 2 సిక్సర్లు), కేఎల్ రాహుల్ (78 బంతుల్లో 42, 8 ఫోర్లు) రాణించడంతో తొలి రోజు మూడు సెషన్లలో భారత్ సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించింది. రెండో రోజూ ఇదే ఆటను కొనసాగిస్తే మ్యాచ్‌పై గిల్ సేనకు పట్టుచిక్కినట్టే! ఇక బౌలింగ్‌లో అనుభవలేమితో ఇంగ్లండ్ పేసర్లు తొలిరోజు పూర్తిగా తేలిపోయారు. స్టోక్స్ (2/43) మినహా మిగిలిన పేసర్లు ఏమాత్రం ప్రభావం చూపలేకపోయారు.

### ఆరంభమే అదుర్స్

టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్‌కు తాము ఎంత తప్పు చేశామో తెలియడానికి పెద్దగా సమయం పట్టలేదు. అండర్సన్, స్టువర్ట్ బ్రాడ్ లేని లోటు ఆ జట్టులో.. స్పష్టంగా కనబడింది. సీనియర్ పేసర్ క్రిస్ వోక్స్‌తో పాటు బ్రైడన్ కార్స్, జోష్ టంగ్ తేలిపోవడంతో భారత ఓపెనర్లు స్వేచ్ఛగా బ్యాటింగ్ చేసి అదిరిపోయే ఆరంభాన్నిచ్చారు. బౌండరీతో పరుగుల వేటను ఆరంభించిన జైస్వాల్, రాహుల్ ఇంగ్లిష్ పేసర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. పూర్తిగా ఆఫ్‌సైడ్ ఆటతో అలరించిన ఈ ద్వయం 16 బౌండరీలు కొడితే.. అందులో అన్నీ ఆఫ్‌సైడ్‌లో ఆడినవే కావడం విశేషం. స్టోక్స్ బౌలింగ్‌లో రాహుల్.. బ్యాక్ టు బ్యాక్ బౌండరీలతో అలరించాడు. కానీ సాఫీగా సాగుతున్న భారత ఇన్నింగ్స్‌లో లంచ్‌కు ముందు డబుల్ షాక్ తాకింది. కార్స్ వేసిన 25వ ఓవర్లో రాహుల్.. ఆఫ్ స్టంప్‌కు ఆవలగా వెళ్తున్న బంతిని వెంటాడి ఫస్ట్ స్లిప్స్‌లో జో రూట్ చేతికి చిక్కాడు. ఆ తర్వాతి ఓవర్‌లో స్టోక్స్ వేసిన పక్కా ప్రణాళికతో సాయి సుదర్శన్ అరంగేట్ర టెస్టు అతడికి నిరాశను మిగిల్చింది.

### జైస్వాల్, గిల్ జోరు

92/2తో భోజన విరామానికి వెళ్లొచ్చిన భారత్.. ఆ తర్వాత జోరు పెంచింది. కెప్టెన్ గిల్ ఆరంభంలో వన్డే తరహా ఆట ఆడాడు. వోక్స్ బౌలింగ్‌లో మూడు బౌండరీలు రాబట్టాడు. 96 బంతుల్లో జైస్వాల్ ఫిఫ్టీ పూర్తయింది. గిల్ అండతో జైస్వాల్ కూడా దూకుడు పెంచాడు. వోక్స్ 38వ ఓవర్లో 3 ఫోర్లు బాదిన అతడు.. టంగ్ ఓవర్లో డీప్ పాయింట్ మీదుగా సిక్సర్ బాదాడు. గిల్ కూడా టంగ్ ఓవర్లో బౌండరీతో 55 బంతుల్లోనే అర్ధ శతకం పూర్తిచేశాడు. టెస్టులలో అతడికి ఇదే ఫాస్టెస్ట్ (బంతులపరంగా) హాఫ్ సెంచరీ. కార్స్ 48వ ఓవర్లో తొలి బంతిని బౌండరీగా మలిచి 90లలోకి వచ్చిన జైస్వాల్.. అదే ఓవర్లో 4, 5 బంతులనూ ఫోర్లు కొట్టాడు. ఆరో బంతికి సింగిల్ తీసి తన కెరీర్‌లో ఐదో శతకం నమోదుచేశాడు. అయితే టీ విరామానికి వెళ్లొచ్చాక స్టోక్స్ వేసిన రెండో ఓవర్లో జైస్వాల్ బౌల్డ్ అవడంతో 129 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది.

### రాకుమారుడి తొలి ముద్ర

జైస్వాల్ నిష్క్రమించే సమయానికి ఆటపై పూర్తి పట్టు సాధించిన గిల్.. పంత్‌తో కలిసి స్కోరుబోర్డును నడిపించాడు. ఇన్నింగ్స్‌కు ఇరుసైన నాలుగో స్థానంలో పరిస్థితులకు తగ్గట్టుగా ఆడుతూ శతకం దిశగా సాగాడు. ఫిఫ్టీ తర్వాత కాస్త నెమ్మదించిన గిల్.. పంత్‌తో స్ట్రైక్ రొటేట్ చేసి ఇన్నింగ్స్‌ను పునర్నిర్మించాడు. బషీర్ బౌలింగ్‌లో పంత్ ఫోర్, సిక్సర్‌తో భారత్ 300 పరుగుల మార్కును అందుకుంది. 98 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద టంగ్ బౌలింగ్‌లో ఆఫ్‌సైడ్ బౌండరీ బాదిన గిల్.. సారథిగా తొలి టెస్టులోనే బ్యాట్‌తో తన ముద్రను ఘనంగా వేశాడు. టెస్టుల్లో అతడికి ఇది ఆరో శతకం. పంత్ తన సహజశైలికి భిన్నంగా సంయమనంతో ఆడటం గమనార్హం. అజేయమైన నాలుగో వికెట్‌కు గిల్-పంత్ ద్వయం ఇప్పటికే 130 పరుగులు జోడించింది.

**5** ఇంగ్లండ్‌లో తొలి టెస్టు ఆడుతూ శతకం చేసిన ఐదో భారత బ్యాటర్ జైస్వాల్. అతడికంటే ముందు సందీప్ పాటిల్, గంగూలీ, విజయ్ మంజ్రేకర్, మురళీ విజయ్ ఉన్నారు.

### సంక్షిప్త స్కోర్లు

భారత్ తొలి ఇన్నింగ్స్: 85 ఓవర్లలో 359/3 (గిల్ 127*, జైస్వాల్ 101, స్టోక్స్ 2/43, కార్స్ 1/70)

**1** ఇంగ్లండ్‌తో వారిగడ్డపై టెస్టులు ఆడుతూ మొదటి రోజు ఆటలో భారత్‌కు ఇదే అత్యధిక స్కోరు. 2022లో ఎడ్జ్‌బాస్టన్ టెస్టులో 338/7 చేసింది. మొత్తంగా శ్రీలంక (2017లో శ్రీలంకపై 399/3), సౌతాఫ్రికా (2001లో 372/1) తర్వాత విదేశీ గడ్డపై థర్డ్ హయ్యస్ట్ స్కోరు.

### అయ్యో సాయి



జూన్ 20.. భారత క్రికెట్ దిగ్గజాలుగా వెలుగొందుతున్న సౌరవ్ గంగూలీ, రాహుల్ ద్రావిడ్, విరాట్ కోహ్లీకి ఈ తేదీ ఎంతో ప్రత్యేకం. దాదా, ద్రావిడ్ 1996లో ఇదే రోజు ఇంగ్లండ్‌పై అరంగేట్రం చేయగా కోహ్లీ సైతం 2011 జూన్ 20న వెస్టిండీస్‌తో మ్యాచ్‌లో టెస్టులకు ఎంట్రీ ఇచ్చాడు. దిగ్గజాలు టెస్టు అరంగేట్రం చేసిన రోజే సాయి సుదర్శన్ కూడా టెస్టులలో తొలి అవకాశం అందుకున్నా అదృష్టం మాత్రం అతడిని వెక్కిరించింది. మొదటి టెస్టులో గంగూలీ సెంచరీ చేయగా ద్రావిడ్ 95 రన్స్ చేశాడు. కోహ్లీ 19 పరుగులు చేయగా.. సాయి డకౌట్ అయ్యాడు.



మల్హర్ మండలం బొగ్గులవాగు శివారులో ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు ఇన్‌సెట్‌లో పెద్దపులి అడుగులు

## బాబోయ్ పెద్దపులి

- మల్హర్ మండలం ఎడ్లపల్లి బొగ్గులవాగు శివారులో సంచారం
- ఆవుపై దాడి చేసి చంపడంతో చుట్టు పక్కల గ్రామాల్లో కలవరం

మల్హర్, జూన్ 20 : పెద్దపులి సంచారంతో అడవిలో మళ్లీ అలజడి రేపింది. మల్హర్ మండ లం ఎడ్లపల్లి బొగ్గులవాగు శివారు అటవీ ప్రాంతంలో ఆవుపై దాడి చేసి చంపడంతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కొయ్యూరు రేంజర్ రాజేశ్వరరావు కథనం ప్రకారం.. ఎడ్లపల్లి గ్రామంలోని గుర్రం రాజయ్యకు చెందిన ఆవు బొగ్గులవాగు శివారు అటవీ ప్రాంతంలోకి మేతకు వెళ్లగా, పెద్దపులి దాడి చేసి చంపింది. స్థానికుల సమాచారంతో అటవీ అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని పరిసరాలను పరిశీలించగా పెద్దపులి అడుగులు కనిపించడంతో నిర్ధారణకు వచ్చారు. ఆవుపై దాడి చేసిన పెద్దపులి కొద్దిరోజులపాటు ఇదే ప్రాంతంలో తిరిగే అవకాశముండడంతో ట్రాకింగ్ కెమెరాలు ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు సూచించారు. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, గొర్రెల కాపరులు సాయంత్రానికి ఇండ్ల చేరుకోవాలని, పులి ఆనవాళ్లు కనిపిస్తే సమాచారం ఇవ్వాలన్నారు.

# జోహార్.. జోహార్

- అశ్రునయనాలతో గణేశ్‌కు వీడ్కోలు
- ఎరుపెక్కిన వెలిశాల
- భారీగా తరలి వచ్చిన జనం
- హాజరైన ప్రజా సంఘాల, రాజకీయ నేతలు
- అమరవీరుడికి ఘన నివాళి
- రాష్ట్ర సరిహద్దుల్లో నుంచి తరలివచ్చిన అభిమానులు



నినాదాలు చేస్తున్న మధుసూదనాచారి



ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని ప్రజా సంఘాల ర్యాలీ

జయశంకర్ భూపాలపల్లి, జూన్ 20 (నమస్తే తెలంగాణ)/టేకుమట్ల : వెలిశాల ఎరుపెక్కింది. పోరాటాల పురిటి గడ్డ భోరునవిలపించింది. ఆంధ్రా, ఒడిశా సరిహద్దుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన గాజర్ల రవి అలియాస్ గణేశ్ అలియాస్ ఉదయ్ మృతదేహం శుక్రవారం ఉదయం వెలిశాలకు చేరుకోగానే, కడసారి చూసేందుకు ప్రజాసంఘాల, పౌర హక్కుల నేతలు, రాజకీయ నేతలు, విప్లవ కవులు, కళాకారులతోపాటు జనం పెద్దఎత్తున తరలివచ్చారు. గణేశ్ మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఉదయం గణేశ్ మృతదేహం గ్రామానికి చేరుకోగా విప్లవ కళాకారులు, కవులు కేంద్రప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను పాటలు, ఉపన్యాసాలతో ఎండగట్టారు. మధ్యాహ్నం ఒంటిగంటకు ప్రారంభమైన అంతిమయాత్ర 5 గంటలపాటు సాగింది. ప్రజా సంఘాల నాయకులు ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపేయాలని గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మావోయిస్టులతో చర్చించి, బూటకపు ఎన్‌కౌంటర్లు నిలిపేసి శాంతి నెలకొల్పాలని డిమాండ్ చేశారు. సరిహద్దు నుంచి వచ్చిన వారిలో అధిక శాతం మహిళలే ఉన్నారు. వారిని కదిలిస్తే 'గణేశ్ మా దేవుడు అంటూ సమాధానం ఇచ్చారు. మా కోసం ఆయన చాలా చేశారు.. అందుకే ఇంత దూరమైనా కడసారి చూసేందుకు వచ్చాం' అని సమాధానం ఇచ్చారు.

గణేశ్ మృతదేహానికి వెలిశాల గ్రామస్తులు, ప్రజలు, విప్లవ కళాకారులు, కవులు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై నివాళులర్పించారు. ఎమ్మెల్సీ, శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, విప్లవ సంఘం నేతలు గాదె ఇన్నయ్య, చెరుకు సుధాకర్, అమరుల బంధు మిత్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అంజమ్మ, ఉపాధ్యక్షురాలు శోభ, పౌరహక్కుల సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి, సింగరేణి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు దామెర గట్టయ్య, జగన్, పుట్ట రాజన్న, కిరణ్, భారతక్క, చలపతి పాల్గొని నివాళులర్పించారు. కగార్ పేరిట కేంద్రం చేపట్టిన ఆపరేషన్‌ను వెంటనే నిలిపివేయాలని జనశక్తి చర్చల ప్రతినిధి అమర్ అన్నారు. శాంతి చర్చల పేరిట ప్రభుత్వాలు మారణహోమం సృష్టిస్తున్నాయని అరుణోదయ కళాకారుల సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క అన్నారు. ఆదివాసీలకు అండ గా నిలిచిన గణేశ్‌ను పట్టుకొని చిత్రహింసలకు గురి చేసి కాల్చి చంపి ఎన్‌కౌంటర్ అంటూ కట్టుకథలు అల్లుతున్నారని అన్నారు.

### ప్రజా సమస్యలు పరిష్కరించాలి

**ఎమ్మెల్సీ మధుసూదనాచారి**

మావోయిస్టుల ప్రాణాలు తీయడం కాదు. వారు కోరుకున్నట్లు ప్రజాసమస్యలను పరిష్కరించి దోపిడీని నిర్మూలించాలి. మావోయిస్టులతో చర్చలు జరిపి మారణహోమం ఆపి శాంతిని నెలకొల్పాలి. ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని కేసీఆర్ లక్షల మంది హాజరైన, కోట్ల మంది వీక్షించిన ఎల్కతుర్తి సభలో మక్తకంఠంతో తెలిపారు. కేంద్రం మాత్రం పంతానికి పోయి ప్రజల ప్రాణాలు తీయడం సమంజసం కాదు. గాజర్ల రవి మృతిపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ చేపట్టాలి.

# 'బెస్ట్' స్కూళ్లకు నిధుల గండం

ఏటూరునాగారం/జనగామ చౌరస్తా/నర్సంపేట, జూన్ 20 : బెస్ట్ అవైలబుల్ స్కీం కింద ఎంపిక చేసిన ప్రైవేటు పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తుంటారు. దరఖాస్తు చేసుకున్న వారిని లక్కీడిప్ ద్వారా ఎంపిక చేసి సర్కారు ఏటా ఒక్కో డే స్కాలర్‌కు రూ.28 వేలు, రెసిడెన్షియల్ విద్యార్థికి రూ. 42 వేలు ఖర్చు చేస్తుంది. పాఠశాలలకు విద్యా సంవత్సరంలో విడతల వారీగా ఫీజు చెల్లిస్తుంటారు. కానీ రెండేళ్లుగా ఫీజులు చెల్లించకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ములుగు జిల్లాలో ఎంపిక చేసిన మూడు ప్రైవేట్ పాఠశాలల్లో 203 మంది గిరిజన విద్యార్థులు చదువుతున్నారు. కాగా, 2023-24, 2024-25 విద్యా సంవత్సరానికి రూ. 1.35 కోట్లు ఫీజుల బకాయిలు పేరుకుపోయాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో రెండు స్కూళ్లలో 45 మంది విద్యార్థులు చదువుతుండగా, ఆయా పాఠశాలలకు రూ. 38 లక్షలు చెల్లించాల్సి ఉంది. దీంతో పాఠశాలల యాజమాన్యాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయి. దీంతో పదో తరగతి పూర్తయిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇచ్చేందుకు కొన్ని పాఠశాలలు నిరాకరించినట్లు సమాచారం. దీంతో వారు ఐటీడీఏలోని పీవో, గిరిజన సంక్షేమశాఖ అధికారులను సంప్రదించగా సర్టిఫికెట్లు ఇవ్వాలంటూ యాజమాన్యాలకు మెమోలు జారీ చేశారు. కొందరు సర్టిఫికెట్లు ఇవ్వగా మరికొందరు ఇబ్బంది పెట్టినట్లు తెలుస్తోంది. కాగా, ఈ స్కీం కింద ఎంపికైన ఒక పాఠశాల మేనేజ్‌మెంట్ కొద్ది నెలల క్రితం మారగా, ఈ విద్యా సంవత్సరం ఫీజు చెల్లించి చదవాలని హుకుం జారీ చేసింది. ఫీజు బకాయిలను గట్టిగా అడగలేని పరిస్థితిలో పాఠశాల యాజమాన్యాలు తమ పాఠశాలలో వసతి సదుపాయాలు కల్పించలేకపోతున్నామని కొత్తగా విద్యార్థులను చేర్చుకోలేమని కూడా అంటున్నట్లు సమాచారం. దీంతో పాఠశాలలు పునఃప్రారంభమైనప్పటికీ విద్యార్థులు వెళ్లలేదు. తొమ్మిదో తరగతి పూర్తి చేసిన తనను పదోతరగతిలోకి ప్రవేశం కల్పించడం లేదంటూ విద్యార్థిని శివాణి గిరిజన సంక్షేమ శాఖ ఏవో కిరణ్ కృష్ణారావుకు విన్నవించగా సంబంధిత యాజమాన్యంతో ఫీజులు ప్రభుత్వం చెల్లిస్తుందని, విద్యార్థులను ఇబ్బంది పెట్టవద్దని ఫోన్ ద్వారా సూచించారు. అదేవిధంగా వరంగల్ జిల్లా నర్సంపేట మండలంలోని మహేశ్వరం గ్రామ శివారులోని శివానీ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం చేతులెత్తేసింది. ప్రభుత్వం నిధులు విడుదల చేయలేకపోవడంతో పాఠశాల నడపలేకపోతున్నామని, ఇక నుంచి ఫీజులు చెల్లిస్తేనే విద్యార్థులకు పంపించాలని సూచించారు. దీంతో చేసేది ఏమీ లేక విద్యార్థులు, తల్లిదండ్రులు ఇంటి దారి పట్టారు.

### జనగామ జిల్లాలో 383 మంది విద్యార్థులు..

ఈ స్కీమ్ కింద జనగామ జిల్లాలో 383 మంది విద్యార్థులు ఒకటి నుంచి 10తరగతి వరకు చదువుకుంటున్నారు. జిల్లాలోని మూడు ఎంపిక చేసిన ప్రైవేట్ పాఠశాలలకు సుమారు రూ.2 కోట్లకు పైగా బిల్స్ ప్రభుత్వం నుంచి రావాల్సి ఉన్నట్లు తెలిసింది. దీంతో ఆయా పాఠశాల యాజమాన్యాలు ఆర్థిక ఇబ్బందులతో బీఏఎస్ విద్యార్థులకు చదువు చెప్పడానికి నిరాకరిస్తున్నారు. ఈ విషయంపై అధికార యంత్రాంగం పాఠశాల యాజమాన్యాలతో పలుమార్లు చర్చించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో బీఏఎస్ విద్యార్థులు తరగతి గదిలో తోటి విద్యార్థుల మధ్య వివక్షను ఎదుర్కొంటున్నారు. మీ పిల్లలకు పుస్తకాలు, కాపీలు కావాలంటే ముందుగా డబ్బులిచ్చి కొనుక్కోండి.. ఆ తర్వాత ప్రభుత్వం నిధులిస్తే తిరిగి చెల్లిస్తామని ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు నిర్మొహమాటంగా చెబుతున్నాయి. పుస్తకాలు, కాపీలు లేక టీచర్ ఇచ్చిన హోం వర్క్ చేయకుండా బడికి వెళ్లి ఏం చేయాలని చిన్నారులు తల్లిదండ్రులను ప్రశ్నిస్తున్నారు. ఇక మేం బడికి వెళ్లమంటూ తెగేసి చెబుతున్నారు.

**బకాయిలు ఉన్నది వాస్తవమే...**

బెస్ట్ అవైలబుల్ స్కీమ్‌లో ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలకు బకాయి ఉన్నది వాస్తవమే. త్వరలో ప్రభుత్వం ఆ నిధులు విడుదల చేస్తుంది. విద్యార్థులకు పుస్తకాలు, కాపీలు ఇవ్వకుండా యాజమాన్యాలు ఇబ్బంది పెట్టొద్దు. ఈ విషయంపై ఇప్పటికే పలుమార్లు పాఠశాల యాజమాన్యాలతో చర్చించాం.

– విక్రమ్ కుమార్, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి, జనగామ



ఏటూరునాగారం ఐటీడీఏలో అధికారులను కలిసేందుకు వచ్చిన విద్యార్థులు, తల్లిదండ్రులు



వరంగల్ ఎంజీఎం దవాఖానలో యంత్ర పరికరాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ సత్య శారద

## దాతల సహకారం అభినందనీయం

**కలెక్టర్ సత్యశారద**

వరంగల్ చౌరస్తా, జూన్ 20: ఎంజీఎంహెచ్‌లో వైద్య సేవలను మెరుగు పరచడం కోసం యంత్ర పరికరాలు అందజేస్తున్న దాతల సహకారం అభినందనీయమని వరంగల్ కలెక్టర్ సత్యశారద అన్నారు. శుక్రవారం ఎంజీఎంహెచ్ పీడియాట్రిక్ వార్డుకు జనప్రియ, బిలియన్ హార్ట్స్ బీటింగ్ ఫౌండేషన్ సుమారు రూ. 60 లక్షల వ్యయంతో ఎక్స్‌రే, ఈసీజీ, పారా మానిటర్లు, డబుల్ సర్ఫేస్ ఫొటోథెరపీ వంటి 13 రకాల 41 యంత్ర పరికరాలను అందజేశారు. అతిథిగా కలెక్టర్ సత్యశారద, జనప్రియ ఫౌండేషన్ చైర్మన్ రవీందర్‌రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కా ర్యక్రమాన్ని ప్రారంభించారు. ఉత్తర తెలంగాణ ప్రజల వైద్య సేవల కోసం ఏర్పాటు చేసిన ఎంజీఎంహెచ్‌లో ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ లాంటి పొరుగు రాష్ట్రాల ప్రజలకు సైతం సేవలు అందిస్తుందని అన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ నిధుల ద్వారా దాతలు అందించిన యంత్ర పరకరాల మూలంగా పీడియాట్రిక్ విభాగం మరింత బలోపేతం అవుతుందని అన్నారు. తద్వారా పిల్లలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి వీలు కలుగుతుందని అన్నారు. ఇదే తీరున మరింత మంది దాతలు ముందుకు వచ్చి హాస్పిటల్ అవసరాలను సమకూర్చడానికి సహకరించాలని కోరారు. అనంతరం యంత్ర పరికరాలను అందించిన జనప్రియ ఫౌండేషన్ చైర్మన్ రవీందర్‌రెడ్డి, ఎండీ సతీశ్‌కుమార్, బిలియన్ హార్ట్స్ బీటింగ్ ఫౌండేషన్ కంట్రీ హెడ్ సుధా జిజారియాలను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ కిశోర్‌కుమార్, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సాంబశివరావు, పలువురు విభాగాధిపతులు, ఆర్‌ఎంవోలు, వైద్యులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆయుర్వేద వైద్య విద్యార్థినిపై ర్యాగింగ్

కాశీబుగ్గ, జూన్ 20 : వరంగల్ నగరంలోని లేబర్‌కాలనీ ప్రాంతంలో గల ప్రభుత్వ అనంతలక్ష్మి ఆయు ర్వేద వైద్య కళశాలకు చెందిన విద్యార్థినిపై సీనియర్లు ర్యాగింగ్ చేసినట్లు శుక్రవారం కళాశాల యజమాన్యానికి ఫిర్యాదు చేశారు. గ్రేటర్ వరంగల్‌లోని ఓ ప్రైవేట్ హాస్టల్లో వీరు ఉంటున్నారు. ఈ క్రమంలో సెకండియర్ విద్యార్థినిపై తృతీయ సంవత్సరం విద్యార్థినులు ర్యాగింగ్ చేసినట్లు విద్యార్థిని తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. మానసికంగా ఇబ్బందులకు గురిచేసేలా గత ఆరునెలల నుంచి ర్యాగింగ్ చేస్తున్నట్లు తెలిపారు. వెంటనే వైద్య కళాశాల ర్యాగింగ్ కమిటీని అప్రమత్తమైంది. వారం రోజుల్లో విచారణ చేపట్టి నివేదిక ప్రకారం చర్యలు తీసుకుంటామని వైద్య కళాశాల నిర్వాహకులు తెలిపారు.